స్కెచ్

# స్వ విషయం

వడ్లపట్ల దయానందం

"వేరుశనగపప్పుమీది పొట్టులో ఏ విటమిన్ ఉంటుందీ!" ఫ్రడ్ బి వన్ అఫ్ ది క్లవరెస్టు హెడ్స్ అఫ్ ది ఫ్యూచర్ వోర్ల్డ్; మిష్టర్ చలం ధర్మసందేహం.

"ఆహాఁ... పరిశోధించకుండా విడిచిపెట్టబడ్డది అదొక్కటేరా... బహుశా నీలాంటి వాడికోసమే విడిచిపెట్టేసుంటారు ... గమ్మున రిసెర్చి చేసేసి ప్రకటించు..." బాబ్జీగాడు అంటూనే నవ్వుతూ అరుగెక్కాడు.

డాబా కొట్ల అరుగు పీఠాధిపత్యం వాడిదే...

"ఓరేవ్ చవటా యు ప్లీజ్ ఎసెండ్ ది త్రోన్" అన్నా పచారీ కొట్టు పక్కనున్న జాజికాయ పెట్టె చూపిస్తూ...

ఆరంగుళాల ఎత్తుండి... కూర్చున్న రావిడికి నునుపు తేలి నిగనిగలాడుతున్న ముఖాకలదాన్ని ఒంటి చేత్తో అవలీలగా ఎత్తేసి పచారీకొట్టుకి ఈపెడ వేసుకు కూర్చున్నాడు బాబ్జిగాడు.

ఉదయించిన సూర్యుడపుడే జానెడు మీదికి లేచి కళపెళ లాడుతున్నాడు. మెయిన్‌రోడ్ మీద రకరకాల జనం ముమ్మరంగా పోతున్నారు.

కూర్చున్న క్షణంలోనే వాడి దృష్టలా రోడ్డు మీద పడింది... తీక్షణంగా చూస్తూ నిశితంగా పరిశీలిస్తున్నాడు — ఆశ్చర్యం ... అర పరకమంది రోడ్డు సైడు రోమియోలు ఒక్కుమ్మడిగా అదే సంఖ్యలో ఉన్న జూలియట్‌లని వెంటాడుతున్నారు... జ్యూలియట్లు వాలు చూపులూ... రోమియోల విట్సూ... పెద్ద ఎత్తున కొనసాగిపోతున్నయ్.

వాడి దృష్టి ఆ దృశ్యంనుంచి విత్‌డ్రా చేసుకుని అప్పటికే హాజరైన సభ్యులందరిమీదికీ పోనిచ్చి... చటుక్కున నా మీద నిలిపేశాడు.

నా గుండెల్లో పీకేరాయి దూరి కూర్చుంది.

నాముందు పెట్టి కూర్చున్న చార్‌మినార్ పెట్టె కనులపండుగగా కన్పించి ఉండాలి...

అంతే అయింది... కనుబొమ్మ లెగరేసి... ద్విభాషా రాష్ట్ర నిర్ణయాన్ని నిశితంగా విమర్శిస్తూ మధ్యలో నిర్లక్ష్యంగా అంది పుచ్చేసుకున్నాడా పెట్టె. వాడి సాహసానికి మెచ్చుకున్న అందరూ ... వెంటనే వాణ్ణనుసరించేశారు ... ఫలితంగా మరుక్షణంలో కాళీపెట్టె... మురుక్కాలువలో నిస్సహాయంగా తేలిపోతుంది...

రెండుదమ్ములు తీక్షణంగా లాగి హుందాగా బొడ్డు రాల్చుతూ వాడంటాడు...

"మొత్తంమీద పి. ఎస్. పి. పని శ్లేష్మంలో పడ్డ ఈగ చందం అయింది... ఇక కమ్యూనిస్టులు చూడబోతే... ఫలానా ఇన్ని సంవత్సరాలక్రితం మేము సూచించిన సూచల్ని ఈనాటికైనా నెహ్రూజీ గ్రహించి తదనుగుణంగా విధానాలను రూపొందిస్తున్నారు కనుక... ద్వితీయ పంచవర్ష ప్రణాలికలో మేము చెప్పినట్టు పారిశ్రామికాభివృద్ధికి ప్రాముఖ్యం ఇచ్చారు కనుక... మేము బల్ల గుద్దేసి సమర్థిస్తున్నాం అంటున్నారు... ఎటొచ్చీ ఒక్క "గోహింయా" మట్టుకు... అది సరే మొన్నెక్కడో నెహ్రూజీని నిశితంగా విమర్శించినందున శ్రీ కామత్ తగిన రక్షణతో ఉపన్యాస వేదికనుంచి నిష్క్రమించవలసి వచ్చిందట... అయ్యా పీఠారాధన తత్వానికీ దీనికీ భేదమేమిటంటారు? అసలు ప్రజాస్వామిక దేశాలలో ప్రతిపక్షాలు బలపడుతూండటం సహజం కాదా... ఇప్పటి తీరుతెన్నులు చూస్తూంటే సదరు "జీ' యొక్క ఖ్యాతి జ్యోతి కాంతి కిరణాలముందు 'ప్రతిపక్షం' అన్న పదార్థం... క్రమ క్రమంగా అదృశ్యమైపోయేలా ఉన్నదే ... సభ్యులూ ... ప్రజాస్వామ్యానికి పట్టిన ఈ దుస్థితికి కారణం ఏమిటంటారూ?'—

వాడెప్పుడూ ఇంతే ... విడదీయ వీలులేని చిక్కుసమస్యల్ని సభ్యుల మీదికి విడిచ్చేసి సిగరెట్టు ఊదేస్తూ కూర్చుండి పోతాడు.

మెయిన్‌రోడ్డు దరినే ఉన్న డాబాకొట్టు అరుగుమీద...ఇక అక్కణ్ణుంచి సర్వవిషయాల మీద కూలంకష చర్చ జరిగి పోతుంది...కడుపులో పేగులరిచేవరకూ.

కాని... ఈ నాటి విశేషం...

ఎదురుగుండా ఉన్న కిళ్ళీకొట్టు బడ్డీచెక్క మీద ఆవారా బనీనులో ఉన్న అతనెవరో...సూయజ్ కెనాల్ తగాదామీద తన అభిప్రాయాలేవో గట్టిగా చెప్పేస్తున్నాడు అక్కడ చేరిన నలుగురికీని. నెహ్రూజీని సంప్రదించకుండా నాజర్ అంత ధైర్యం చేస్తాడని తను ససేమిరా నమ్మలేనంటున్నాడు-

"మరేం ప్రమాదం లేదు లెమ్మంటున్నాడు" వింటున్న వాళ్ళలో ఒకడు. అది వినిపించుకోకుండా ఒక విషయం మాత్రం అతను రహస్యంగా అందరికీ చెప్పేశాడు.

"ఇక ముందు ముందు...మనదేశంలో ఉన్న బ్రిటిష్‌వాళ్ళ కంపెనీలని జాతీయంచేసి పారేయడానికి ఇది ఎంతయినా ఉపకరిస్తుంది...అమ్మో నెహ్రూజీ అంటే సామాన్యమటండీ...బ్రహ్మాండమైన బుర్రకదూ..." చిన్నప్పటి స్నేహితునిలా మాట్లాడేసి ఆగిపోయాడు.

ఈ మాట వినడంతోనే పచారీకొట్టు సూర్యనారాయణ ఒక్క అదుటన అక్కడికి ఉరికేసి అతన్ని వాటేసుకు లాక్కొచ్చి కూర్చోపెట్టుకున్నాడు. కాఫీకిసైతం ఆర్డరిచ్చేసి రేఖలన్నీ విచ్చుకున్న పువ్వులాంటి ముఖంతో ఆత్రంగా అడిగాడు.

"ఏమండీ...నెహ్రూజీకి సంబంధించిన విషయాలు (పెద్ద ఎత్తులోనివి) మరి కాసిని చెప్పండి" అని.

"భగవంతుడు కేవలం పరుల్ని స్తోత్రించడానికే కంఠాన్ని ఇవ్వలేదన్నది"...ఆ నూతనాగంతకుని విశ్వాసం. అక్షరాలా ఆదే రుజువు చేశాడు—నెహ్రూజీని అలా సూయజ్ స్ట్రగుల్‌లో విడిచిపెట్టేసి...

తన పేరేమిటైందీ ... తనదేప్రాంతమైందీ ... ఏయే నాయకుల హృదయాలలో ప్రాంతీయ, కుల, తత్వాలు ఎంతెంతగా పేరుకుపోయిఉన్నదీ, తను ఏయే పార్టీలలో ఎంతెంత కాలం జిల్లా స్థాయిలో నాయకత్వం వహించిందీ ... ఏయే మంత్రితో తనకి ఎంతెంత సన్నిహితసంబంధంఉన్నదీ మొన్నీమధ్యకర్నూలులో కలవని తలంపుగా కలిసిన ఫలానామంత్రి తనని ఆనవాలుకట్టి ఎంతగా ఆదరించిందీ అసలు తనకీమధ్య రాజకీయాలమీద విరక్తి ఎందుకు కలిగిందీ..." సరళమైన భాషలో వినసొంపుగా బుర్రకథలా చెప్పుకుపోతున్నాడు.

అయితే అంతంత పెద్ద కబుర్లు చెప్పేస్తున్న అతను...ఒక చిన్న విషయాన్ని గుర్తించలేకపోయాడనే అనాలి. అక్కడ కూర్చున్న అందరూ అతి సామాన్యులే అనుకున్నాడు.

కాబోయే ఇంజనీర్లు...ఆవబోయే డాక్టర్లు... అయిపోయి ఉద్యోగాల్లేని గ్రాడ్యుయేట్లు...పంచవర్ష పథకం వేసుకుని ఇంటరును సాధించడానికి కృషి సల్పుతున్న కృషీవలలు...ముఖ్యంగా పట్టణ రాజకీయ చదరంగపుటాటలో ఎత్తులు సూచించే మేధా సంపన్నులూ...ఇక్కడ కూర్చున్నదీ అని గ్రహించగలిగి ఉంటే ఆ బాణీకి ఏనాడో ఫుల్‌స్టాప్ పెట్టేశేవాడే...పాపం.

"అబ్బ ఇక సహించడం కష్టంరా ఈ సెల్ఫ్" అంటూ రెండు చెవులూ మూసుకు బాబ్జిగాడే అన్నాడు.

"అయ్యా మీరు రాజకీయ రంగంనుంచి విరమిస్తే దేశం గతేంకాను...ప్రజలకిక దిక్కెవరు! అవునుకానీ ఈమధ్య ఏదో రాష్ట్ర గవర్నరు పదవి కాళీ వచ్చిందట...మీరు కాని హైకమాండ్ దృష్టిలో ఉన్నారా!" పుటుక్కున అనేశాడు. అంతే...ఇక సూర్యనారాయణ పట్టుకు కట్టేయబోయినా ఆగలేదు. క్షణంలో మాయమైపోయాడు. సూర్యనారాయణ కొట్టు విడిచి నిప్పులు తొక్కిన కోతిలా అయిపోయాడు. నెహ్రూజీమీద ఈగ వాలితే బాధపడతాడు పాపం...

"హూఁ...అవునయ్యా మీరంతా అభివృద్ధిని కానలేని కబోదులు...ఏం చెయ్యలేదు. ఎన్ని చెయ్యలేదు...సంస్థానాల విలీనీకరణ...కాంది శీకులకి రక్షణ...జమీందారీరద్దు" కోపంతో గడగడ చదువుకు పోతూండగానే మధ్యలో కొన్ని నేనందిస్తూంటాను.

"అవునవును... ఏలూరు స్పెల్లింగ్‌లో మార్పు బెజవాడని, విజయవాడగా మార్చడం... వన్యమృగ సంరక్షణానికి ప్రత్యేక శ్రద్ధవహించడం వివాహ వయఃపరిమితుల నిర్ణయానికి వారాల తరబడి పార్లమెంటు చర్చలు జరిపించడం..." ఆ స్పీడులో ఔనసేసి, తర్వాత నాలుక కఱచుకుని నన్ను సైతం ఆ క్షణంలోనే అభివృద్ధి నిరోధకుల లిస్టులో చేర్చి పారేస్తాడు సూర్యనారాయణ.

ఏదేలా ఉన్నా ఒక్క విషయానికి మట్టుకు మేమంతా ఏకగ్రీవంగా గర్విస్తాం... అది కాస్తా బయట పెట్టేస్తే ఉత్త అతిశయోక్తిగా కన్పిస్తుం దేమో... ఓపికతో సిదానించి చూస్తే మట్టుకు నూరింట ఒకపాలు సైతం సత్యదూరం కాదన్నది రూఢౌతుంది.

ప్రపంచ రాజ్యాలన్నింటిలోనూ భారతదేశానికి ఒక విశిష్టస్థానముందన్నది ఏ ఒక్క భారతీయుడూ వ్యతిరేకించనట్టి విషయం... అయితే భారత దేశం లోని రాష్ట్రాలలో ఆంధ్రకు ప్రత్యేకస్థానం ఉందన్నది ప్రతి ఒక్క ఆంధ్రునికి విశ్వాసం కూడాను. ఇక సర్కారు ప్రాంత శ్రేష్ఠమన్నది నిర్వివాదం కదా?... అట్టి సర్కారు ప్రాంతంలోని పశ్చిమ గోదావరికి ధాన్యాగారమన్న పేరు ఎలానూ ఉన్నదయ్యె... అట్టి జిల్లాకు ముఖ్యపట్టణమైన మా ఏలూరుకు (హేలాపురీ నగరవైభవాన్ని గూర్చి ప్రత్యేకంగా మరొకసారెప్పుడైనా రాస్తాను) యూనివర్సల్ ప్రపంచంలోనే ఒక విశిష్టస్థానముందని సదరు హేలాపురీ పౌరులమైన (పురప్రముఖులం కాదు) మాకు అహ ఇలా ఆలోచించుకోవడంలో పేచీ సబబు ఏమిటీ అని... ఇంతకుముందన్న 'ఏకగ్రీవ' అన్న పదం ఒక్క 'మా' పరిధిలో మాత్రమే అటు పైన ఎవరిత్రోవ వారిదై 'నా'లోకి—'నేను'లోకి మారటంలో కూడా పేచీ సబబు ఏమీ కన్పించదు. ఈ విషయం సరే. ప్రస్తుతానికి చర్చ చంద్రలోక యాత్రమీదికి మళ్ళగా కుస్తీలంటే చెవి కోసుకునే మా 'శివం' కరపత్రం ఒకటి పట్టుకొచ్చి వస్తూనే 'చూచారా - విన్నారా?' అన్నాడాత్రంగా....

"ఛాలంజీపై ఛాలంజీ చేసిన వారిపై సవాల్" అట. పడిపోన్లు అటూ ఇటూ లో ఎవరైనాసరే తొడ చరుస్తారట... మన రంగణ్ణి (ముద్దు పేరు 'స్కెలిటన్'... అరచేతిలో ఎక్కించుకుని 'ఉఫ్' అని ఊదితే పక్షిలా ఎగిరిపోగలడు) వేద్దాం... గెలిచినా ఓడినా వెయ్యిరూపాయలు. కుస్తీలంటే చెవికోసుకునే నాబోటి గాళ్ళ దగ్గర్నుంచి బలే దండుకుంటున్నారయ్యా ఈ పహిల్వాన్‌లు" కీచుమంటూ నవ్వేసి ఆగిపోయి... రోడ్డుమీద ఎవరో వాదులాడుకుంటూంటే అటు చూచాడు—

వాళ్ళలో ఒకడంటున్నాడు—

"ఏడిశావులేరా... పుట్టిల్లు చూసినప్పుడే నే చెప్పేశాను జమున పెద్దస్టారైపోద్దని... ఒరే వేమన వెంకటప్పయ్యకి 'గిరిజ' ఫోటో పంపిందిరా... ఆడు నీకు చూపించే ఉంటాడులే... అవును కానీ 'జమున'కి ఉత్తరం రాయాలిరా... ఫొటో పంపమని"

అంజలి నోదిలేసి జమున్ని పొగిడేయడం రెండోవాడికి సనేమీరా ఇష్టంలేదు—

"తగ్గరా అక్కడికి ... అంజలి ముందు ఈళ్ళంతా..."

"ఊహు కేచస్తే వప్పను" - అంటున్నాడు మొదటివాడు... అదే వాదులాట. అటు చూస్తూ పక్కన నవ్వేశాం. అంతే అంతా నిశ్శబ్దం—

---

"తెనుగువారి కెన్నో లోపములుండవచ్చును. బ్రతుకు తెలియకపోవచ్చును. బలమైన వ్యక్తి ప్రత్యేకత లుండవచ్చును. తత్కారణంగా తెనుగునాట వీరపూజ లేకపోవచ్చును. జాతీయ పీకుడు లేకపోవచ్చును. కాని కవి పూజకు మాత్రము లోటులేదు. ఒక కవిని యేనుగెక్కించి చక్రవర్తి స్వహస్తముతో గండ పెండేరము తొడిగించినాము. మరియొక కవి బంగారు నాణెములతో అభిషేకము చేయించినాము. ఈనాటికీ చేయించుచున్నాము. మనకు వారు కవి భూవిభులు, కవి పితామహులు, కవిరాజులు, కవి సార్వభౌములు, కవి సమ్రాట్టులు. ఏల? సంప్రదాయమును పోషించినారు గనుక, ధర్మము ప్రచారము చేసి, ప్రతిష్ఠించినారుగనుక; విశ్వశ్రేయము నుపాసించినారు గనుక.(—తెలంగాణా రచయితల సభలో శ్రీ గోపాలరెడ్డి.)